సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 8 । నవంబర్ । 2022



స్పందన సమస్యలు సత్వర పరిష్కారం
- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే
- ప్రజల నుంచి 60 అర్జీల స్వీకరణ

8లో



మన్యం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
- అర్హులందరికీ ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు
- ఎంపీపీ బడుగు రమేష్

8లో

విద్యార్థులకు నాణ్యమైన భోజనం
- 'రాష్ట్రీయ బాలల సురక్ష' జిల్లా కోఆర్డినేటర్ లీలాప్రసాద్ ఆదేశం
- ఆశ్రమ పాఠశాల, కళాశాల వసతి గృహాల తనిఖీ
- మరుగుదొడ్లలో అపరిశుభ్రతపై అసంతృప్తి

8లో

వలసపోకుండానే.. కులాసాగా..

- జిల్లాలో సత్ఫలితాలిస్తున్న ఉపాధి హామీ
- పథకాలకు అనుసంధానంతో స్థానికంగా కూలి పనులు
- సద్వినియోగం చేసుకుంటున్న గిరిజనులు
- బాసటగా ప్రభుత్వ నిర్ణయాలు

జిల్లాలో ఉపాధి హామీ పథకం సత్ఫలితాలనిస్తోంది. 22 మండలాల పరిధిలో గిరిజనులకు ఉపాధి కల్పిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది. ఈ నిధులను ప్రభుత్వం వివిధ పథకాలకు అనుసంధానం చేయడంతో స్థానికంగా అందుబాటులోకి వచ్చిన పనులను గిరిజనులు సద్వినియోగం చేసుకుంటున్నారు.



ఉపాధి పనుల్లో నిమగ్నమైన గిరిజనులు

సాక్షి,పాడేరు: ఉపాధి హామీ పథకం గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతోంది. స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో వలసలు భారీగా తగ్గాయి. ఇంటిల్లిపాది ఉపాధి పనుల్లో పాల్గొని ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు.

మూడు ఐటీడీఏల పరిధిలో..

పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలో 2,18,512 జాబు కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 4,22,846 మందికి 86 లక్షల పనిదినాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 3,31,219 మంది గిరిజన కూలీలు 81,27,269 పనిదినాలను పూర్తి చేశారు. జాబ్‌కార్డు దారుల్లో 4,845 కుటుంబాలు వంద రోజుల ఉపాధి పనులను పూర్తి చేశారు.

జోరుగా పనులు

జిల్లాలోని 22 మండలాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఉపాధి హామీలో వ్యవసాయానికి అనుకూలమైన పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. - వ్యవసాయ భూముల అభివృద్ధి, మట్టి చదును, కందకాలు, అమృత సరోవర్, చెరువుల అభివృద్ధితో పాటు ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు, మట్టి రోడ్లు తదితర పనులను చేపడుతున్నారు.

భవనాలు,మౌలిక సదుపాయాలకు..

పాడేరు డివిజన్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం 3476 పనులకు రూ.741.15 కోట్ల ఉపాధి నిధులు ప్రభుత్వం వెచ్చించింది. ఉద్యానవన పంటల సాగుకు రూ.77.93 లక్షలు, అవెన్యూ ప్లాంటేషన్ (రోడ్డు పక్క మొక్కలు) 653.01 కిలోమీటర్ల మేర నాటేందుకు రూ.1.72లు కేటాయించింది. వైఎస్సార్ జలకళలో 101 పనులను రూ.1.21 కోట్లతో చేపట్టింది.

- ఉపాధి పనులు జరిగే చోట అధికారులు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. టెంట్లు, సురక్షిత తాగు నీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచుతున్నారు.

వేతన చెల్లింపు వేగవంతం

ఉపాధి పనులు చేసిన గిరిజన కూలీలకు కూలి సొమ్ము చెల్లింపులను కూడా ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. రోజుకు రూ.257 వేతనం అందేలా అధికారులు చర్యలు చేపట్టారు. వారంలో రెండు సార్లు వేతనం సొమ్ము వారి ఖాతాల్లో జమఅవుతోంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ. 21 కోట్ల ఉపాధి హామీ నిధులను వేతనదారులకు పంపిణీ చేశారు.

రోడ్లు, భవన నిర్మాణాలకు వెచ్చించిన నిధులు

- గ్రామ సచివాలయాలు 212కు రూ.84.71కోట్లు
- రైతుభరోసా కేంద్రాలు 209కు రూ.45.58 కోట్లు
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు139కు రూ.20.51కోట్లు
- బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలు 106కు రూ.16.68కోట్లు
- వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు 203కు రూ.32.48కోట్లు
- బీటీ రోడ్లు 219కు రూ.112.17 కోట్లు
- సీసీరోడ్లు 1197కు రూ.152.27
- డబ్ల్యూబీఎం రోడ్లు 455కు రూ.178.42
- సీసీ డ్రైన్లు 237కు రూ.33.07కోట్లు
- ప్రహరీలు 499కు రూ.65.25కోట్లు

'ఉపాధి'తో భూమి అభివృద్ధి



ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ భూముల అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. ఖరీఫ్ వరినాట్లు పూర్తయిన సమయం నుంచి గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేపడుతున్నాం. మెట్ట భూముల చదును, పంట కాలువల తవ్వకం పనులు చేపట్టడం ద్వారా ప్రతి రోజు కూలికి ఇబ్బందులు లేకుండా ఉపాధి హామీ పథకం ఆదుకుంటోంది.

–పాంగి సత్యారావు, కామయ్యపేట గ్రామం, హుకుంపేట మండలం

వలసలు తగ్గాయి



నిబంధనల ప్రకారం అర్హులందరికీ ఉపాధి కల్పిస్తున్నాం. జిల్లాకు 86 లక్షల పనిదినాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 81 లక్షల పని దినాలు వేతనదారులకు కల్పించి, 94.50 శాతం మేర లక్ష్యం పూర్తి చేశాం. వేతన చెల్లింపులు పారదర్శకంగా చేపడుతున్నాం. వలసలు తగ్గించగలిగాం.

–ఎస్.రమేష్ రామన్, ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో సత్యదీక్షలు



పవనగిరి క్షేత్రంలో సత్యదీక్ష చేపడుతున్న భక్తులు

అడ్డతీగల: స్థానిక **పవనగిరి క్షేత్రంలో** సోమవారం మూడవ **విడత సత్యదీక్షలు** కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంపచోడవరం డివిజన్‌లోని 11 గ్రామాలకు చెందిన భక్తులతోపాటు మైదాన ప్రాంతమైన ఏలేశ్వరం, మర్రివీడు ప్రాంతాలకు చెందిన 90 సత్యదీక్షలు చేపట్టారు. అన్నవరం దేవస్థానం నుంచి అందజేసిన దీక్షా వస్త్రాలను ధరించి సోమవారం వేకువజామునే పవనగిరికి చేరుకున్న భక్తులచే పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య మాలధారణ చేయించారు.అనంతరం రమా సత్యనారాయణ స్వామి ఆలయంలోని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి వినతి



పీవో సూరజ్ గనోరేకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అధికారులు

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న గండిపోచమ్మ అమ్మవారి ఆలయానికి ప్రత్యామ్నాయంగా నూతన ఆలయ నిర్మాణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేగవంతం చేయాలని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, ఈవో జీవీ లక్ష్మీకుమార్ ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేను కోరారు. ఈమేరకు సోమవారం కలిసిన వారు వినతి పత్రం అందజేశారు.అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

సమగ్ర భూ రీసర్వేకు సహకరించాలి



వాలమూరు గ్రామంలో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

మారేడుమిల్లి: జగనన్న సమగ్ర భూ సర్వేకు గ్రామాల్లో ప్రతిఒక్కరూ సహకరించాలని జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాస్ కోరారు. సోమవారం ఆయన మండల రెవెన్యూ అధికారులతో కలిసి మండలంలోని జీఎంవలస పంచాయతీ పరిధిలోని వాలమూరు గ్రామంలో పర్యటించారు. గిరిజనుల భూముల రీసర్వేను పరిశీలించారు. భూసర్వే ప్రయోజనాలను గిరిజనులకు వివరించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన లంపీ వ్యాక్సినేషన్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో పశువుల ఆసుపత్రిని రంపచోడవరం ఇన్‌చార్జ్ ఏడీ (పశుసంవర్ధకశాఖ) సీహెచ్.గణేష్ సోమవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. మండలవ్యాప్తంగా జరిగుతున్న లంపీ స్కిన్ వ్యాధినిరోధక వ్యాక్సినేషన్‌పై ఆరా తీశారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచనలిచ్చారు. ఆయనతో పాటు డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ వై.జి.డి.ప్రియాంక, స్థానిక వెటర్నరీ డాక్టర్ తరుణ్ కుమార్, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నారు.

పాపికొండలు పర్యాటకానికి ట్రయల్‌రన్

- పోచవరం బోట్ పాయింట్ నుంచి ప్రారంభానికి ఏర్పాట్లు
- రేపటి నుంచి బయలుదేరనున్న బోట్లు



గోదావరి నదికి పూజలు చేస్తున్న అధికారులు

వీఆర్‌పురం: మండలంలోని పోచవరం బోట్ పాయింట్ నుంచి ఈనెల 9వ తేదీ నుంచి పాపికొండల విహారయాత్రకు బోట్లు బయలుదేరేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు అధికారికంగా అనుమతులు రావడంతో సోమవారం బోట్ యూనియన్ ఆధ్వర్యంలో బోట్ పాయింట్ వద్ద ట్రయిల్ రన్ నిర్వహించారు. కంట్రోల్ రూమ్‌ను ఎంపీడీవో ఫణీంద్ర, డీటీ ఎస్.సుబ్బారావు, ఎస్‌ఐ టి.దుర్గాప్రసాద్ ప్రారంభించారు. అనంతరం బోట్ పాయింట్ వద్ద గోదావరి నదికి ప్రత్యేక హారతి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయిహనుమాన్ బోట్‌కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గోదావరిలో ట్రయిల్‌రన్‌కు బయలుదేరింది. ఈనెల 9వ తేదీ నుంచి పోచవరం బోట్ పాయింట్ నుంచి బోట్లు బయలుదేరుతాయని డీటీ సుబ్బారావు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ రాజేష్, బోట్ యూనియన్ ప్రతినిధులు మామిడి వెంకటరమణ, సీహెచ్.ప్రకాశరావు, వాళ్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం

- అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- అర్హులందరికీ అటవీహక్కు పట్టాల పంపిణీ



అటవీ హక్కు పట్టాల లబ్ధిదారులతో ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి/చింతపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బెన్నవరం పంచాయతీలో సోమవారం రైతు భరోసా కేంద్రం, సచివాలయం, అంతర్లలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కేంద్రాలను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వంగా జగన్ ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పట్టాలు పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. మండలంలోని 1829 మందికి అటవీహక్కు పట్టాలను పంపిణీ చేసినట్టు వారు వివరించారు. గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు, పాలను మరింత చేరువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షురాలు దూరియా పుష్పలత, వైస్ ఎంపీపీ శారద, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, చింతపల్లి ఎంపీటీసీలు పద్మ, జయలక్ష్మి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లీ తదితరలు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు,ఎంపీడీవోలు, తహసీల్దార్లు, టూరిజం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంజంగి, కొత్తపల్లి జలపాతం, చెరువుల వేనం, కొత్తవలస, తాజంగి పర్యాటక ప్రాంతాల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. చెరువులవేనం ప్రాంతంలో బ్లాస్టింగ్ పనులు వెంటనే పూర్తిచేసి రహదారి పనులు ప్రారంభించాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు వేగంగా జరగాలన్నారు. వంజంగి హిల్స్, కొత్తపల్లి జలపాతం ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటుచేయాలని సూచించారు. అరకులోయలో గిరిజన మ్యూజియంలో షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలను నిర్వాహకులనుంచి వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. షాపులు పొందిన వారు వ్యాపారాలు ప్రారంభించకపోతే నోటీసులిచ్చి కేటాయింపులు రద్దు చేస్తామని పీవో స్పష్టం చేశారు. అనంతరం తాజంగిలో జిప్‌లైనర్, బోటింగ్ ఆదాయాల వివరాలపై సమీక్షించారు. ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు, ఈఈలు, గిరిజన మ్యూజియం మేనేజర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాల కృష్ణ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రాజెక్టు రివ్యూ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఒడి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రైతు భరోసా, అటవీ హక్కుల చట్టం అమలు, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకాల అమలుపై సమీక్షించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, డీఈవో రమేష్, తహసీల్దార్లు, పీఎంయూ అధికారులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ.. శంభోశంకర!

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- బారులు తీరిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



కూనవరం శివాలయంలో దీపారాధన నిర్వహిస్తున్న మహిళలు



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



పాడేరు పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

సాక్షి,పాడేరు: పవిత్ర కార్తీకమాసం కార్తీక పౌర్ణమి, రెండవ సోమవారంతో జిల్లాలోని అన్ని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజామునుంచే భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.నరసింగరావు దంపతులు శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఇతర కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రసాద పంపిణీని వారు ప్రారంభించారు. పాతపాడేరు, లగిశపల్లి, తురాయిమెట్ట, వంజంగి, తామరాపల్లి, గెడ్డంపుట్టు శివాలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి శివారు రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం ఆయుష్షు హోమం నిర్వహించారు. సమస్త జీవకోటి ఆయురారోగ్యాలతో జీవించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆలయ పూజారి ముర్ల రాజారెడ్డి తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. అంతకుముందు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.అనంతరం ఆలయం ఎదురుగా కొలువైన భారీ లింగాకార రూపుడైన కదంభేశ్వరునికి పంచామృతాలు, ఫల పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. గోమాతకు పసుపు,కుంకుమ అద్ది పూజలు జరిపారు. అన్నదానం నిర్వహించారు.



వేటమామిడిలో అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఆయుష్షు హోమం

మత్స్యగుండంలో ఆధ్యాత్మిక శోభ

హుకుంపేట: ఆధ్యాత్మిక కేంద్రం, ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో కార్తీక మాసం రెండవ సోమవారం రోజు పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మత్స్యగెడ్డలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో దీపారాధన నిర్వహించారు. మత్స్యదేవతలకు ప్రసాదాలు సమర్పించారు.

రైలు ఢీకొని యువకుడికి గాయాలు

అరకులోయ రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అరకు సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద సోమవారం 25 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు రైలు ఢీకొని తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని గాయాలతో ఉన్న యువకుడిని వైద్యం కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా యువకుడిని గుర్తిస్తే వారి బంధువులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, సమీక్షలో పాల్గొన్న అధికారులు

- సకాలంలో పూర్తి
- సబ్ కాంట్రాక్టర్లకు పనులివ్వొద్దు
- నాణ్యత లోపాలను ఉపేక్షించం
- కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక

సాక్షి, పాడేరు: జల్‌జీవన్ మిషన్ పథకం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ జల జీవన్ మిషన్, ఆర్‌డబ్ల్యూఎస్ పనుల ప్రగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యత లోపాలుంటే సహించేది లేదని హెచ్చరించారు. రూ.5 లక్షల కన్నా తక్కువ, అంతకన్నా ఎక్కువ ఖర్చుతో చేపట్టిన పనుల ప్రగతిపై మండలాల వారీగా ప్రగతి వివరాలు తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ల వారీగా వారు చేస్తున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. ఒకొక్క కాంట్రాక్టర్‌కు నాలుగు పనుల కన్నా ఎక్కువ అప్పగించవద్దన్నారు. క్లాస్‌వన్ కాంట్రాక్టర్లకు కూడా పది పనులకు మించి అప్పగించవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కువ పనులు తీసుకున్న కాంట్రాక్టర్లు సబ్ కాంట్రాక్టర్లకు ఇస్తే పనుల్లో నాణ్యత ప్రమాణాలు తగ్గుతాయన్నారు. సబ్‌కాంట్రాక్టర్లను అనుమతించవద్దని సూచించారు. సుమారు రూ.9 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నందున వెంటనే వాటిని అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఏఈఈలు,డీఈఈలు బిల్లులను ఈఈకి పంపించాలని ఆదేశించారు. తాగునీటి పథకాలకు సంబంధించి, సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకుల సహకారం తీసుకోవాలని, ఈ మేరకు ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. సకాలంలో ప్రారంభంకాని పనులను రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతపల్లిలో ఒక కాంట్రాక్టర్ పది పనులు చేపట్టినందున అవి పూర్తయ్యేవరకు కొత్త పనుల టెండర్లలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గడప గడపకు ప్రభుత్వం కింద మంజూరైన పనులను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.లీలా కృష్ణ, ఉపకార్య నిర్వాహక ఇంజినీర్లు చంద్ర కిరణ్, ఎం.జయరాం, జీఆర్ హెచ్ రాజు, గోపాల కృష్ణ, ప్రకాష్, సహాయ కార్య నిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలిగాలులు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- మినుములూరులో 14..
- అరకులోయలో 14.1..
- చింతపల్లిలో 15.2 డిగ్రీలు నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని ప్రాంతాలలోను చలిగాలులు అధికమయ్యాయి. దీనికి తోడు కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 14 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 14.1 డిగ్రీలు.చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు సోమవారం ఉదయం నమోదయ్యాయి. పాడేరు ప్రాంతంలో ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడలేదు. చలితీవ్రత నుంచి బయటపడేందుకు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.



పాడేరులో చలిమంటలను ఆశ్రయించిన స్థానికులు

మంచుదుప్పటి

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గిరిజన గ్రామాల్లో చలి తీవ్రతతో గిరిజనులు వణికిపోతున్నారు. గత వారం రోజులుగా ఉదయం పూట విపరీతంగా మంచు కురుస్తుండడంతో గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సోమవారం ఉదయం 9గంటల వరకు గిరిజన గ్రామాలను మంచు తెరలు కమ్మేశాయి. చలిమంటలతో ఉపశమనం పొందుతున్నారు.



పాడేరులో ఉదయం 10 గంటల వరకు కురుస్తున్న పొగమంచు

వైరామవరం: వై.రామవరం ప్రధాన రహదారిలో సోమవారం ఉదయం విపరీతమైన పొగమంచు కురిసింది. ఉదయం 8 గంటలైనా మంచుతెరలు వీడలేదు.



ముంచంగిపుట్టులో మంచులో రాకపోకలు

ఆదర్శంగా అరకులోయ అభివృద్ధి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ఎంపీపీలు,ఎంపీటీసీలు,సర్పంచ్‌లతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి, పాడేరు: అరకులోయ నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్నామని, అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పాడేరులోని తన నివాస గృహంలో అరకులోయ నియోజకవర్గ పరిధి ముంచంగిపుట్టు, హుకుంపేట, పెదబయలు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ప్రధాన సమస్యలపై సమీక్షించారు. ఆయా గ్రామాల్లో తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలపై నివేదిక పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అరకులోయను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారని, ఈ మేరకు రూ.62కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. ఆయా నిధులతో అత్యవసర అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు,తాగునీటి పథకాల పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీల అభిప్రాయంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులకు పారదర్శకంగా నిధులు కేటాయింపులు చేపడతామన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతి సచివాలయానికి గడప గడపకు మన ప్రభుత్వంలో రూ.20లక్షలు మంజూరు చేస్తోందని, ఆయా నిధులతోనే గ్రామాల్లె మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీలు రాజుబాబు, సీతమ్మ, బొంజుబాబు, నాయకులు విశ్వేశ్వరరావు, సత్తిబాబు, శామ్యూల్.పెదబయలు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్

హుకుంపేట: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేకుంటే అనారోగ్యం బారినన పడే అవకాశం ఉందని రాష్ట్రీయ బాలల సురక్ష ప్రోగ్రామ్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియార్ కళాశాల విద్యార్థుల వసతి గృహాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన మెనూ అమలుకాకపోవడంతో ఉడకని అన్న పెట్టడం, మరుగుదొడ్ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్త చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమాత్రం తగదన్నారు. ఆరోగ్యశాఖ విస్తరణ అధికారి గుల్లెలి సింహాద్రి, సిబ్బంది కోడా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మన్యం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీపీ బడుగు రమేష్

కొయ్యూరు: మన్య ప్రాంతాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. మండలంలోని యూ.చీడిపాలెంలో సోమవారం జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ గిరిజనులకు పోడు భూములపై హక్కులు కల్పించిన చరిత్ర సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత పాలకులు చేయలేని పనిని ముఖ్యమంత్రి జగనన్న చేసి చూపించారన్నారు. 151 మందికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ పంచాయతీలో ఇప్పటివరకు 851 మందికి పట్టాలు అందజేశామన్నారు. బాక్సైట్ తవ్వకాల జీవో 97ను ప్రభుత్వం రద్దు చేయడం చరిత్రాత్మకమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని సీఎం జగనన్న అమలుచేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు మట్లాడుతూ గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మాధవ్‌రావు, సర్పంచ్ రమేష్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, సర్పంచ్ నూకాలమ్మ, వీఆర్‌వో పండయ్య, నేతలు శ్రీను బాబు, గురుమూర్తి, సత్తిబాబు, దామోదర్, ఉప సర్పంచ్ చిరంజీవి, సీతమ్మ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

108లో సుఖ ప్రసవాలు



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎన్‌టీ శ్రీను

జి.మాడుగుల: లువ్వాసింగి పంచాయతీ సంగులోయ గ్రామానికి చెందిన కె.నూకరత్నంకు ఆదివారం రాత్రి 8గంటలు సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో లువ్వాసింగి గ్రామ సమీపంలో తప్పసి పరిస్థితులో ప్రసవంతో ఆమె మగ శిశువుకు జన్మనిచ్చిందని ఈఎన్‌టీ శ్రీను తెలిపారు.తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యం నిమిత్తం పాడేరు ఆస్పత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు. అలాగే పెదబయలు మండలం తూలం గ్రామానికి చెందిన కాసులమ్మకు నొప్పులు అధికం కావడంతో 108కు అందించిన సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున 1.30గంటలకు గ్రామానికి వెళ్లి తిరగి వస్తుండగా మద్దిగరువు–భీరం గ్రామాల మధ్యలో మగశిశువుకు జన్మనిచ్చినట్టు ఈఎన్‌టీ శ్రీను తెలిపారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యం నిమిత్తం జి.మాడుగుల పీహెచ్‌సీకి తరలించినట్టు చెప్పారు. సుఖ ప్రసవం చేసిన ఈఎన్‌టీ శ్రీనుని వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

స్పందన సమస్యల సత్వర పరిష్కారం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: స్పందనలో స్వీకరించిన వినతులకు సంబంధించిన సమస్యలు సత్వరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. సోమవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో ప్రజలనుంచి సుమారు 60 అర్జీలను స్వీకరించారు. వీటిలో కొన్నింటిని వెనువెంటనే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అర్జీలు అందాయన్నారు.ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ ఎం వెంకటేశ్వ రావు, ఈఈ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- రంపచోడవరం మండలం ముసురుమిల్లి ప్రాజెక్టు ముంపు బాధితులకు గతంలో జాగరం పల్లి గ్రామ సమీపంలో 44 మందికి ఆర్‌అండ్ ఆర్‌ప్యాకేజీ, గృహాలు నిర్మించారు, వీటికి పట్టాలు మంజూరు చేయాలని మడకం చెంచమ్మ,బందం శ్యాంబుల్లి, మడకం లక్ష్మి వినతిపత్రంలో కోరారు.
- రంపచోడవరంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని, పోలవరం ముంపునకు గురైన చిన్నారిగండి గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని గిరిజన సంక్షేమం సాంస్కృతిక సంఘం నాయకుడు కోసం లచ్చన్నదొర, మడకం ప్రసాద్‌దొర, సవలం శుభకృష్ణదొర వినతిపత్రం సమర్పించారు.
- ఆకూరు పంచాయతీ కాకవాడ నుంచి కోయలగూడెం వరకు తారురోడ్డు నిర్మాణం చేయాలని, ఈతపల్లి కాలుపై వంతెన నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.
- వాల్మీకులకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఇవి లేకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె చిన్న నారాయణరావు ,గసిడే బాబురావు, అనుదీప్ ఐటీడీఏ పీవోను కోరారు.
- ముసురుమిల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్ల శ్లాబ్‌లు లీకవుతున్నందున మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్ కోసు రమేష్‌బాబు, వలల సరస్వతి కోరారు.
- వ్యవసాయ భూములకు పట్టాలు మంజూరు చేయాలని దాలిపాడు గిరిజనులు కోరారు.

ఆక్రమణ దుకాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని రహదారికి ఇరువైపులా పుట్‌పాత్‌పై అక్రమంగా నిర్మించిన దుకాణాలను రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో సోమవారం తొలగించారు. పుట్‌పాత్‌లను ఆక్రమణతో ట్రాఫిక్ సమస్య మారిందని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దుకాణాల తొలగిస్తూ, సామగ్రి తరలించారు. సమచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సంబంధిత అధికారులతో మాట్లాడి వ్యాపారస్తులకు కొంత గడువు ఇచ్చి, తరువాత తొలగించాలని ఆదేశించడంతో దుకాణాలు తొలగింపునకు తాత్కాలికంగా నిలిపివేశారు, తహసీల్దార్ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్,ఎస్‌ఐలు సంతోష్, కుమార్‌బాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



హాజరైన తహసీల్దార్లు, సర్వేయర్లు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ

పాడేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైఎస్సార్ శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భూముల రీసర్వేను పక్కాగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచించారు. సోమవారం ఆయన స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో కొయ్యూరు, అనంతగిరి, అరకు మండలాలకు చెందిన మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, గ్రామసచివాలయాల సర్వేయర్లతో సమీక్షించారు. భూముల రీసర్వేను ఆరు నెలల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇద్దరు సర్వే సాంకేతిక నిపుణులు, ఇద్దరు వీఆర్వోలు, ఇద్దరు సర్వేయర్లు బృందంగా ఏర్పడి వేగవంతం చేయాలని సూచించారు. సర్వే చేస్తున్న గ్రామంలో గ్రామ వలంటీర్లు ముందుగా సమాచారం ఇచ్చి రైతులను చైతన్య వంతులను చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియ సంబంధిత భూయజమాని సమక్షంలో వివాదాలకు తావులేకుండా నిర్వహించాలన్నారు. సర్వే సహాయ సంచాలకులు వై.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పౌష్టికాహారం పంపిణీ

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- గర్భిణులు, బాలింతల ఇళ్లకు అందజేయాలని సూచన
- ఐదుగురు డీలర్లపై చర్యలు తీసుకుంటామని వెల్లడి



సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు బాధ్యతగా పంపిణీ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన పాడేరు నియోజకవర్గ పరిధిలోని ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 36 నెలల వయసు వరకు గల పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్త హీనతతో బాధ పడుతున్న వారు, హైరిస్క్ గర్భిణులు గుర్తించి వారి ఆరోగ్యపరిస్థితులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులను ప్రోత్సహించాలని, మాతా శిశుమరణాల నివారణలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు గ్రామ వలంటీర్ల సాయంతో ఇంటింటికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక వాహనాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ సరఫరా చేయాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు వచ్చేలా సర్పంచ్ సహకారం తీసుకోవాలన్నారు. కేంద్రాలకు రాని చిన్నారులకు పాలు, గుడ్లు వారి ఇళ్లకు పంపించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ సిబ్బంది తప్పించుకునే ధోరణితో కాకుండా బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలపై సూపర్‌వైజర్లు, సీడీపీవోలతో కలెక్టర్ సమీక్షించారు. కొన్ని కేంద్రాలకు రేషన్ సరుకులు సకాలంలో అందించకపోవం, బయోమెట్రిక్ తీసుకొని సరుకులు సరఫరా చేయకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తున్న ఐదుగురు డీలర్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పాడేరు నియోజక వర్గ పరిధిలోని అన్ని మండలాల ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

దొంగిలించిన వాహనాల్లో గంజాయి రవాణా

- కిలాడీ వాహన దొంగ విజయ్‌కుమార్ అరెస్ట్
- రాష్ట్ర వ్యాప్తంగా 33 కేసులు, 20 వాహనాల స్వాధీనం



ప్రధాన నిందితుడు విజయ్‌కుమార్





ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో రికవరీ చేసిన ద్విచక్రవాహనాలను చూపిస్తున్న డీసీపీ(క్రైం) జి.నాగన్న, అనంతరం మీడియాతో వివరాలు వెల్లడి

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఓ కిలాడీ వాహన దొంగ పోలీసులకు చిక్కాడు. ఒక్కడే పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను దొంగిలించి.. వాటిని ఏజెన్సీ ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ వాహనాలను ఏజెన్సీలో గంజాయి అక్రమ రవాణాకు కొందరు విరివిగా వాడుతున్నట్లు విచారణలో వెల్లడి కావడంతో పోలీసులు షాకయ్యారు. కేసు వివరాలను క్రైమ్ డీసీపీ నాగన్న సోమవారం ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. పెందుర్తి సుజాతనగర్‌కు చెందిన మడగల విజయ్‌కుమార్(35) చిన్నతనం నుంచి దొంగతనాలకు అలవాటు పడ్డాడు. 2015 నుంచి ద్విచక్ర వాహనాలను గుట్టుచప్పుడు కాకుండా దొంగిలించి విక్రయించడం చేస్తున్నాడు. ప్రస్తుతం అతనిపై రాష్ట్ర వ్యాప్తంగా 33 కేసులు నమోదు కాగా ఓసారి జైలుకు కూడా వెళ్లాడు. అయినా తీరుమార్చుకోకుండా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ద్విచక్రవాహనాలు దొంగతనాలు చేస్తూనే ఉన్నాడు. పదుల సంఖ్యలో దొంగిలించిన ఈ వాహనాలను కొందరి సహకారంతో ఏజెన్సీ ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఆయా ప్రాంతాల్లో విజయకుమార్‌కు కొందరితో సంబంధాలు ఉండటంతో దొంగిలించిన వాహనాలను సులభంగా అక్కడ విక్రయిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నట్లు ద్వారకా క్రైమ్ పోలీసులు గుర్తించారు.

ఇలా పట్టుకున్నారు!: నెల 3వ తేదీన సీతంపేటకు చెందిన పిల్లల సునీత స్నేహితురాలితో కలిసి ద్వారకానగర్ 2వ లైన్‌లో ఉన్న ట్రెండ్స్ షాపింగ్ మాల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో తన సుజుకీ యాక్సస్ ఏపీ 39 ఎస్‌ఎఫ్ 1227 వాహనాన్ని షాపింగ్ మాల్ ఎదుట పార్కింగ్ చేశారు. గంట తరువాత వచ్చి చూస్తే అక్కడ బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వారిని అడిగినా ఫలితం లేకపోవడంతో ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పలు బృందాలుగా వాహన దొంగల కోసం గాలిస్తున్న పోలీసులకు 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరున్న సరిగమ బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా మొత్తం దొంగతనాలు బయటకు వచ్చాయి.

రాష్ట్ర వ్యాప్తంగా 33 కేసులు : రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పదుల సంఖ్యలో వాహనాలను దొంగిలించినట్లు విజయ్‌కుమార్ అంగీకరించాడు. అతను దొంగిలించిన 20 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విజయ్‌కుమార్ వాహనాలను దొంగిలిస్తుంటే, మరో ఆరుగురు వాహన విక్రయాలకు సహకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అతనిపై పలు స్టేషన్లలో 33 కేసులు ఉన్నట్లు గుర్తించారు. అతను ఇప్పటి వరకు ఎన్ని వాహనాలను దొంగిలించాడనే దానిపై విచారణ చేస్తున్నారు. ఈ కేసులో మడగల విజయ్‌కుమార్ ఏ1 ముద్దాయిగా నర్సీపట్నం, గొలుగొండ మండలానికి చెందిన రెడ్డి నరసింహమూర్తి(33) ఏ2, మదాల వాసు(21) ఏ3, వంటాకుల కల్యాణం(58) ఏ4, మర్రి రాజునాయుడు(40)ఏ5, రోలుగుంట మండలం, కొత్తపట్నంకు చెందిన యెర్ర రమణ(19)ఏ6, రాజవొమ్మంగి మండలం లబ్బర్తి గ్రామానికి చెందిన గంపు రమణ(27)ను ఏ7గా పేర్కొంటూ ద్వారకా క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాకు ఈ వాహనాలను కొందరు విరివిగా వాడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో చురుకైన పాత్ర పోషించిన ద్వారకా సీఐ బి.రమణమూర్తి, ఎస్‌ఐ నిహార్, ఉమెన్ కానిస్టేబుల్ జ్యోతితో పాటు పలువురు పోలీసులను క్రైమ్ డీసీపీ నాగన్న అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యలమంచిలి: రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. యలమంచిలి కొత్తపాలెం సమీపంలో సోమవారం మధ్యాహ్నం అనకాపల్లి జిల్లా కృష్ణాపురం కాలనీకి చెందిన కుమ్మ జంపన్న, పాలపర్తి చిన్న ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా కొత్తపాలెం గ్రామం సమీపంలో ఎదురుగా అతి వేగంగా వస్తున్న మరోవ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొన్నాయని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరికీ ఎస్.రాయవరం 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతి వేగంగా వచ్చి ఢీకొట్టిన వ్యక్తిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పరారయ్యాడని స్థానికులు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

కశింకోట: నూతలగుంటపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం చెందింది. అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం..నూతలగుంటపాలెం గ్రామానికి చెందిన చెవ్వేటి గైరమ్మ(66) సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ హోటల్‌కు వెళ్లి తిరిగి తన ఇంటికి రావడానికి రోడ్డుపై నడిచి వస్తుండగా యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్లే కారు వేగంగా ఢీకొంది. దీంతో గైరమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కుమారుడు బాబూరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

హోల్‌సేల్ వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.75 లక్షల ఆస్తినష్టం



దుకాణం నుంచి వ్యాపిస్తున్న పొగలు

అనకాపల్లిటౌన్: స్థానిక వెంకటేశ్వర థియేటర్ సమీపంలో బొడ్డి అప్పారావుకు చెందిన హోల్ సేల్ వస్త్ర దుకాణంలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. చుట్టుపక్కల వారు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి నరసింగరావు అగ్నిమాపక శకటంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సిబ్బందితో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో రూ.75 లక్షలు ఆస్తినష్టం జరిగిందని అంచనా.

అప్పారావును పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు

అగ్ని ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు దగ్ధమైన వస్త్రదుకాణాన్ని సందర్శించి దుకాణ యజమాని అప్పారావును పరామర్శించారు. ఘటనపై ఆరా తీశారు. మరో రెండు నెలల్లో సంక్రాంతి పండగ కారణంగా ఇటీవల ఎక్కువ సంఖ్యలో బట్టలను ఖరీదు చేసినట్టు చెప్పారు. బట్టలన్నీ కాలిపోవడంతో నష్టం ఏర్పడిందని బాధితుడు వాపోయాడు. పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వర రావు, కల్యాణ్ తదితరులు బాధితుడిని పరామర్శించారు.